క్లుప్తంగా

బీజేపీ మండలాధ్యక్షుడికి అభినందనలు



కొత్తకోట రూరల్: మండల బీజేపీ అధ్యక్షుడిగా ఇటీవల నూతనంగా ఎన్నికైన పాలెం గ్రామానికి చెందిన చీర్ల నర్సింహను ఆదివారం ఆయన స్నేహితులతో పాటు పలువురు నాయకులు పూలమాల వేసి సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత కొన్నేళ్లుగా బీజేపీలో నిబద్ధతతో పనిచేశారని, ఆయన చేసిన సేవలను గుర్తించి సముచిత గౌరవం కల్పించడం సంతోషకమన్నారు. రానున్న రోజుల్లో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీజీ మహేశ్, పరమేశ్, దాసరి విజయ్, పెద్దిరవి, శ్రీశైలం, రాజేశ్ తదితరులు ఉన్నారు.

ఏవీజీఈఏ కార్యవర్గం ఏర్పాటు



వనపర్తిటౌన్: ఆర్యవైశ్య ప్రభుత్వ ఉద్యోగులు సంఘం బలోపేతానికై ఆదివారం జిల్లా కేంద్రంలో ఏవీజీఈఏ (ఆర్యవైశ్య గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్) తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కో–కన్వీనర్లుగా జూటూరి సురేష్‌బాబు, అనంత మధుసూదన్‌గుప్తా, గుబ్బ వాణికుమారి, పాలిశెట్టి ప్రసాద్, పూరి రమేశ్‌బాబు, జనుపల్లి శ్రీరాములును ఎన్నుకున్నారు.వృత్తులలో ఎలా నైపుణ్యాన్ని వృద్ధి చేసుకోవాలి, వారి సమస్యల పరిష్కారం, వివిధశాఖల్లో పని చేస్తున్న ఆర్యవైశ్య ఉద్యోగుల మధ్య సంబంధాన్ని మెరుగుపరిచేందుకు సంఘం ఏర్పడినట్లు వారుతెలిపారు.

హైకోర్టు బార్‌కౌన్సిల్ సభ్యుడికి సన్మానం



కొత్తకోట రూరల్: కొత్తకోట జరుగుతున్న ఓ ప్రైవేట్ కార్యక్రమానికి ఆదివారం రాష్ట్ర హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యుడు జయాకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఆయన్ను కలిసి పూలమాల వేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బోయేజ్, జిల్లా కోర్టు అసిస్టెంట్ ప్లీడర్ మునగారి కృష్ణ, అడ్వకేట్ అనంతరాజు, మిషేక్, సుభాష్, బెనర్జీ, నవీన్‌కుమార్, రాకేష్ ఉన్నారు.

పదిగంటల పని జీఓను వెంటనే రద్దు చేయాలి



గోపాల్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం వాణిజ్య సంస్థల్లో పదిగంటల పని విధానానికి అనుమతులు ఇస్తూ జారీ చేసిన జీఓ 282ను వెంటనే ఉపసంహరించుకోవాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో లేబర్‌కోడ్ చట్టాలను నిరసిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా విభజించి దేశ సంపదను సృష్టిస్తున్న కార్మికులకు కనీస వేతనాలు లేకుండా వారి శ్రమను దోపిడీ చేస్తోందన్నారు. ఇప్పటికైనా కార్మికుల హక్కులను హరించే చట్టాలను రద్దు చేయడంతో పాటు రోజుకు 8 గంటలు పనిచేసే విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెబుతూనే కేంద్రంలోని బీజేపీ చేసిన చట్టాలను రాష్ట్రంలో కాంగ్రెస్ అమలు చేయడం సిగ్గుచేటన్నారు. జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దేశావ్యాప్తంగా కార్మికులకు పరిరక్షణకు జరిగే పోరాటంలో యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, జిల్లా కార్యదర్శి మహేశ్, నాగర్‌కర్నూలు జిల్లా అధ్యక్షుడు శివశంకర్, నాయకులు ఆంజనేయులు, కమలాకర్, భాస్కర్‌గౌడ్, రాజశేఖర్, మహేశ్ పాల్గొన్నారు.

ఆగని ఆర్టీసీ



కొత్తకోటలోని ఆర్టీసీ బస్టాండ్ ముఖ చిత్రం

- అన్ని బస్సులు బైపాస్ మీదుగానే
- రాత్రివేళల్లో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు..
- బస్టాండ్‌కు వచ్చేలా అధికారులు చొరవ చూపాలి

కొత్తకోట రూరల్: కొత్తకోట బస్టాండ్ 1976 మార్చి 16న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంకట్రావు శంకుస్థాపన చేయగా 1978 ఆగస్టు 1న ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి బస్టాండ్‌ను ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన బస్సులతో పాటు రోజుకు 150 నుంచి 200 బస్సుల రాకపోకలు జరుగుతుంటాయి. ప్రతిరోజూ దాదాపు 5వేల మంది ప్రయాణికులు తమ ప్రయాణాలు సాగిస్తుంటారు. అడుగుల దూరంలో ఉన్న బస్టాండ్‌లోకి బస్సులు రావడం లేదు. ఎక్స్‌ప్రెస్‌లు, డీలెక్స్‌లు, సూపర్‌లగ్జరీలు ఏ బస్సులు కూడా బస్టాండ్‌లోకి ప్రవేశించేందుకు ఆసక్తి చూపడం లేదు. పగటిపూట ప్రతి ఆర్టీసీ బస్సు బస్టాండ్‌లోకి రాకపోకలు సాగిస్తుండడంతో ప్రయాణికులు తమ గమ్యస్థానాలు చేరుకునేందుకు వీలు కలుగుతోంది. అత్యధికంగా హైదరాబాద్ వైపు ప్రయాణించే వారే అత్యధికంగా ఉంటున్నారు. జాతీయ రహదారికి చేరువలో ఉండడంతో అర్ధరాత్రి, అపరాత్రి అనే తేడా లేకుండా అత్యవసర సమయాల్లో రాత్రి పూట ప్రయాణాలు సాగించేవారికి కేంద్ర బిందువుగా కొత్తకోట ఉంటోంది. అద్దె, ఖరీదైనా కారుల్లో తిరుగలేని ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. బస్సులు ఆగే పరిస్థితి ఉన్నా బస్సు డ్రైవర్లు అత్యుత్సాహంతో బైపాస్ మీదుగా వెళ్లి పోతున్నారు.

వచ్చేటప్పుడు తిప్పలే..

హైదరాబాద్ నుంచి కొత్తకోటకు వచ్చేటప్పుడు ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. కొత్తకోట బస్టాండ్‌లోకి ఆర్టీసీ బస్సులు వచ్చేందుకు అవకాశం ఉన్నా ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్యంతో కొత్తకోట బైపాస్ వద్దే ప్రయాణికులను దించేస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు, యుక్తవయసు అమ్మాయిలు, ఇలా ఎవరూ ఉన్నా డ్రైవర్లు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో కొత్తకోట హైవేనే ఆర్టీసీ బస్సులకు స్టాఫ్‌గా మారిపోయింది. రాత్రి 7 గంటలు దాటితేనే ఈ ప్రాంతం నిర్మానుష్యంగా జన సంచారం లేకుండా ఉంటోంది. సరిగ్గా ఎనిమిదేళ్ల క్రితం పట్టణ కేంద్రంలో ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న ఓ మహిళపై సామూహిక అత్యాచారం చేసిన సంఘటనలు ఉన్నాయి.

రోజుకు 150 నుంచి 200 బస్సులు...

కొత్తకోటలో వనపర్తి, గద్వాల, మహబూబ్‌నగర్, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్ డిపోకు చెందిన బస్సులు కలుపుకొని ప్రతిరోజూ 200 బస్సుల వరకు కొత్తకోట బస్టాండ్ కేంద్రంగా రాకపోకలు సాగిస్తున్నాయి. కానీ రాత్రి వేళల్లో ఈ బస్సుల సంఖ్య 5 లోపు మించి ఉండకపోవడం ప్రయాణికులను కలవరపరుస్తోంది. స్థానిక ప్రజాప్రతినిధులు డిపోల ఉన్నతాధికారులకు విన్నవిస్తే ప్రయాణికుల సమస్యలు తొలగడంతో పాటు ఆర్టీసీకి సైతం ఆదాయం సమకూరనుంది.

అన్ని డిపోల బస్సులు రావాలి:



కొత్తకోట మీదుగా కాకుండా బైపాస్ గుండా వెళ్లడం వల్ల రాత్రి వేళల్లో ప్రయాణించే వారిని బైపాస్‌లోనే దింపి వెళ్తున్నారు. దీంతో దొంగల బారిన పడుతున్నారు. బస్టాండ్‌ను బైపాస్‌లోకి మార్చితే ప్రయాణికులకు సౌలభ్యంగా ఉంటుంది.

నాగరాజు, కొత్తకోట

రాత్రుళ్లు మరింత ఇబ్బంది:



హైదరాబాద్ నుంచి కర్నూల్ వెళ్లే బస్సులు కొత్తకోట లోపలికి రావడం లేవు. దీంతో ప్రయాణికులకు బైపాస్‌లోనే దింపి వెళ్తున్నారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలి.

శంకర్‌శెట్టి, వ్యాపారి, కొత్తకోట

బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేలా చూస్తాం:



ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక బస్సులు కొత్తకోట బస్టాండ్‌లోకి వచ్చే విధంగా ఆయా ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి బస్సులు రాత్రి వేళల్లో బస్టాండ్‌లోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

వేణుగోపాల్, డిపో మేనేజర్, వనపర్తి

వైభవంగా ఏకాదశి పూజలు



వనపర్తిలో తులసి పుష్పార్చన చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు



కొత్తకోట కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కొత్తకోట రూరల్: తొలి ఏకాదశి సందర్భంగా పట్టణ కేంద్రంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అంబభవానీ మాత ఆలయం, కోదండ రామస్వామి ఆలయం, కోటిలింగేశ్వరస్వామి ఆలయాలు ఉదయం నుంచి భక్తులు పోటెత్తారు. కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో మహామృత్యుంజ సహిత ద్వాదశ జ్యోతిర్లింగాలకు భక్తులు పంచామృతాలతో మహామంగళహారతి ఇచ్చారు.అనంతరం ఆలయంలోని శివలింగానికి పూజలు, అభిషేకాలు చేశారు.

గోపాల్‌పేట: ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా ఉమ్మడి మండలంలోని ఆలయాలు కిటకిటలాడాయి. మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బుద్దారం గండి ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు చేశారు.

ఎమ్మెల్యే దంపతుల ప్రత్యేక పూజలు

వనపర్తి రూరల్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సతీమణి శారదరెడ్డి దంపతులు పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి లక్ష తులసి పుష్పార్చన చేశారు. వేదపండితులు ఎమ్మెల్యే దంపతులకు ఆశీర్వచనాలు ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు.

యథేచ్ఛగా మొరం తరలింపు..



మొర్రం నింపుతున్న పొక్లెయిన్

పాన్‌గల్: మండలంలోని కొత్తపేట–మాందాపూర్ గ్రామాల మధ్యన ఉన్న భీమా కాల్వ మొరంను ఆదివారం కొంతమంది అక్రమార్కులు అక్రమంగా మొరంను తరలిస్తున్నా అధికారులు మాత్రం చూసిచూడనట్టుగా వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. గతంలో భీమా కాల్వ త్రవ్వకంలో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం నుంచి పరిహారం అందజేశారు. దీంతో మరలా మొరం తరలించిన తర్వాత ఆయా భూములు తమకే చెందుతాయని చాలా మంది రైతులు ఘర్షణ పడుతున్నారు. భీమా కాల్వకు సంబంధించిన మొరంను ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తూ కొందరూ ట్రాక్టర్ల యజమానులు లబ్ధిపొందుతూ ప్రభుత్వానికి నష్టం కలిగిస్తోంది. ఇటూ రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులకు విన్నవించినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమ మొరం తరలింపును అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

క్రీడాకారులకు అండగా ఉంటాం



అంధ విద్యార్థి పవన్‌తో గాండ్ల శివకుమార్

- అంధ విద్యార్థికి సహకారం అందిస్తాం
- రాష్ట్ర క్రీడలశాఖ మంత్రి వాకిటి శ్రీహరి

ఆత్మకూర్: రాష్ట్రంలో క్రీడాకారులకు అండగా నిలుస్తామని గ్రామీణప్రాంత క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా ప్రోత్సహిస్తున్నామని రాష్ట్ర క్రీడలశాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో అంతర్జాతీయ గోల్ బాల్ పోటీలకు ఎంపికైన ఆత్మకూర్‌కు చెందిన సమ్మిలిత ఫౌండేషన్ విద్యార్థి పవన్‌కల్యాణ్, భారత జట్టు కోచ్‌గా ఎంపికైన సంస్థ డైరక్టర్ గాండ్ల శివకుమార్‌ను రాష్ట్ర స్పోర్ట్స్ డైరక్టర్ సోనిబాలాదేవితో కలిసి సన్మానించారు. ఈజిప్ట్ దేశంలో సెప్టెంబర్ మొదటివారంలో జరిగే గోల్‌బాల్ క్రీడల్లో ఆత్మకూర్‌లోని సమ్మిలిత ఫౌండేషన్ అంధ విద్యార్థి పవన్ క్రీడాకారుడిగా, శివకుమార్ కోచ్‌గా ఎంపికవ్వడం అభినందనీయమన్నారు. క్రీడాకారులకు అన్నివిధాలుగా అండగా ఉంటామని ప్రభుత్వం తరఫున సహాయసహ కారాలు అందిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రహిమతుల్లా, కోచ్‌లు ఖాదర్, అరుణ్, కిషోర్, దివాకర్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



చెక్కులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరికి సీఎంఆర్‌ఎఫ్, ఒక్కరికి ఎల్‌ఓసీ మంజూరైన చెక్కులను ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, మాజీ సర్పంచ్‌లు కృష్ణయ్యసాగర్, జయరాములుసాగర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన సాయికిరణ్‌కు రూ.46 వేలు, నరేష్‌కు రూ.21,500, కలమ్మకు రూ.75వేలు ఎల్‌ఓసీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేసినట్లు వారు పేర్కొన్నారు. చెక్కులను మంజూరు చేయించిన మంత్రి జూపల్లికి, కాంగ్రెస్ నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రమేశ్, శ్యామ్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, హేమవర్ధన్, కుర్మయ్య, లలితమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రాం



వనపర్తిలో జగ్జీవన్ రాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కవులు, నాయకులు

వనపర్తిటౌన్: స్వాతంత్ర సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ సేవలు ఎన్నటికీ మరువలేనివని మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఉప ప్రధానమంత్రి జగ్జీవన్‌రాం వర్ధంతిని మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారామ్‌ప్రకాశ్ మాట్లాడుతూ.. నిమ్నకులాల వర్గాల అభ్యుదయానికి, తొలిదళిత సామాజిక న్యాయం కోసం కృషి చేసిన యోధుడని కొనియాడారు. కుల నిర్మూలన కోసం పోరాడి, ఆర్టికల్ 17 ప్రకారం నేటికీ బలహీన వర్గాల ప్రజలకు రిజర్వేషన్లు అందడానికి కారణమయ్యాడని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కవి డాక్టర్ నరసింహశర్మ, తెలంగాణ వాల్మీకి సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ మండ్ల దేవన్న నాయుడు, సామాజికవేత్త గంధం నాగరాజు, జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు వెంకటేశ్, కవులు, నాయకులు కొమ్ము వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల అభ్యున్నతికి

ఆత్మకూర్: జగ్జీవన్‌రాం వర్ధంతిని ఆదివారం పట్టణంలో నిర్వహించారు. స్థానిక బస్టాండ్‌చౌక్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ డాక్టర్ శ్రీధర్‌గౌడ్, బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు బంగ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవి యాదవ్, వైస్ ఎంపీపీ కోటేష్ మాట్లాడుతూ.. నిరుపేద ప్రజల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారన్నారు. దేశ ఉపప్రధానిగా అన్నివర్గాల వారికి సమాన న్యాయం కల్పించారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆయాసంఘాల నాయకులు అజ్జపాగ లక్ష్మణ్, అజయ్, శ్యాంసుందర్, మాసన్న, గాలిపంపుశ్రీను, జానకిరాములు, కర్రెశ్రీను, కిషోర్, దండుశ్రీను, జహంగీర్, అనీల్, రాము, రామకృష్ణ, కురుమూర్తి, లింగన్న, వెంకటన్న, బుచ్చన్న తదితరులు ఉన్నారు.

కొత్తకోట రూరల్: బాబు జగ్జీవన్‌రాం వర్ధంతిని కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చౌరస్తాలో ఆయన విగ్రహానికి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. జగ్జీవన్‌రాం ఆశయాలను, ఆలోచన విధానాలకు అనుగుణంగా నేటిసమాజం అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్, ఎన్‌జే.బోయేజ్, సుభాష్, భరత్‌భూషణ్, మిషేక్, అయ్యన్న, ఇబ్రాయిల్, రాములుయాదవ్, సంతోష్‌కుమార్, వినోద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



కొత్తకోట రూరల్: త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కొత్తకోట, వనపర్తి మండలాల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడే జగద్గురువని, జ్ఞానం బోధించే వాళ్లను గురువు అంటారన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత సేవాసమితి సభ్యులు ఎం.వెంకట్రాములు, పురుషోత్తం, మాసన్న, వేణుగోపాల్, బాలకృష్ణ, శివ, ఎం.పద్మ, సి.కృష్ణయ్య, నాగరత్నం, లలిత ఉన్నారు.

ప్రమాదకర విద్యుత్ స్తంభం



వనపర్తి రూరల్: మండలంలోని చిట్యాల చౌరస్తాలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు అంటున్నారు. స్తంభం ప్రక్కనే సిమెంట్ ఆర్చి, ఇనుపరాడ్స్ ఉండడంతో విద్యుత్ తీగలతో షాక్‌కు గురయ్యే ప్రమాదమయ్యే అవకాశం ఉందని ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి త్వరగా మార్చాల ని ప్రజలు కోరుతున్నారు.

మొహర్రం వేళ.. తాగునీటి గోస

అమరచింత: వానాకాలంలో సైతం అమరచింత పట్టణ ప్రజలకు తాగునీటి గోస తప్పడం లేదు. మొహర్రం పండుగ సందర్భంగా నీటి వినియోగం అధికంగా ఉండటంతో ప్రజలు నీటి కోసం తమ ఇంటి ముందున్న కులాయిల వైపు చూడాల్సిన పరిస్థితి దాపరించింది. గత రెండు రోజుల నుంచి మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగు నీటికి సైతం అంతరాయం కలగడంతో ఆయా కాలనీల్లో తాగునీరు రాక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వీటికి తోడు మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న తాగునీటికి బోర్ కూడా మరమ్మతు చేపట్టని కారణంగా ఒకటో, ఎనిమిదో వార్డు ప్రజలకు తీవ్ర నీటి ఇక్కట్లు ఏర్పడ్డాయి. సోమవారం పట్టణంలో ఆలంల సవారీ వేడుకలు ఉండటంతో పట్టణమంతా పండగ వాతావరణం నెలకొన్న వేళ తాగునీటి ఇబ్బందులు కలుగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోలేక పోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణ ప్రజలకు తాగు నీటి ఇబ్బందులేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'స్థానిక' ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరాలి



లక్ష్మీకాంత్‌రెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

అమరచింత: స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ పంచాయతీలతో పాటు మున్సిపాలిటీలను కైవసం చేసుకునే విధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సంఘటితంగా శ్రమించాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర నాయకుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన మండలస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్‌రెడ్డికి డాక్టరేట్ వచ్చినందును ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. పీఎం నరేంద్రమోదీ అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత బియ్యం ఏ మాత్రం లేదని అది కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బియ్యమేననే విషయాన్ని ప్రతి పల్లెకు చేరేలా వివరించాలన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అందించింది ఏ మాత్రం లేదన్నారు. ప్రధాని ఆవాస్‌యోజన్ ద్వారా ఇస్తున్న ఇండ్లనే ఇక్కడ ఇందిరమ్మ ఇండ్లు అని ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను తెలియ పరుస్తున్నదన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు మంగలావణ్య, నాయకులు మేర్వరాజు, నారాయణ, ఆశోక్, భాస్కర్, కృష్ణమూర్తి, హరీష్, మల్లారెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

బీజేపీ నేత బంగ్ల ఔదార్యం

అభివృద్ధికి రూ.3.33 లక్షల విరాళం

ఆత్మకూర్: అభివృద్ధి కార్యక్రమాలకు సొంత నిధులను సమకూర్చుతూ బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు డాక్టర్ బంగ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి ఔదార్యాన్ని చాటుకుంటున్నారు. ఆదివారం ఆత్మకూర్‌లోని ఇందిరానగర్ కాలనీలో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలని కార్యకర్తలు కోరడంతో భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. తనకు రైతుబంధు ద్వారా రూ.3.33 లక్షలు వచ్చాయని ఆ నిధులను అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగిస్తామని వెల్లడించారు.

జూరాల వద్దనే బ్రిడ్జి నిర్మించాలి..

జూరాల గ్రామంవద్ద కృష్ణానదీపై బ్రిడ్జి నిర్మాణం ఆత్మకూర్ మండల ప్రజల చిరకాలవాంఛ అని ఇక్కడ కాకుండా ఇతరచోట బ్రిడ్జి నిర్మిస్తే పెద్దఎత్తున ఉద్యమిస్తామని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు బంగ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో మండల ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. జూరాలవద్ద బ్రిడ్జి నిర్మిస్తేనే ఆత్మకూర్, గద్వాల మధ్య రవాణ సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. అలాగే ఎంపీ డీకే అరుణ సహకారంతో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా బంగ్లా డాక్టరేట్‌ను అందుకోవడంతో బీజేపీ నాయకులు శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో నాయకులు అశోక్‌భూపాల్, విష్ణువర్ధన్‌రెడ్డి, తమ్మలివిజయ్,తమ్మలివెంకటేష్,బోరెల్లిరాము పాల్గొన్నారు.

చెస్ ఏకాగ్రత పెంచుతుంది



బాలికకు బహుమతిని అందజేస్తున్న మురళీధర్

వనపర్తి టౌన్: చెస్‌ఆడటం ద్వారా ఆలోచనశక్తి, నైపుణ్యం పెరుగుతుందని డాక్టర్ మురళీధర్ అన్నారు. ఈ మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్–13 చెస్‌పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చెస్‌తో ఏకాగ్రత పెరుగుతుందని, ఓర్పు, సహనం పెంపొందించి, వ్యూహాత్మకంగా ఆలోచించగలమని చెప్పారు. ముందుచూపుతో నిర్ణయాలు తీసుకునే నైపుణ్యాలు అభివృద్ధి అవుతాయన్నారు. జ్ఞాపకశక్తి, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందన్నారు. బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో పాశంకృతిక, ద్వితీయ ఎం.అభిష్ట, తృతీయ స్థానంలో చైత్ర, బాలుర విభాగంలో ప్రథమంలో శ్రీహాస్, ద్వితీయ ఎం.నీరజ్, తృతీయస్థానంలో సాజిత గెలిచారని జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రెటరీ వేణుగోపాల్ తెలిపారు. ప్రథమ, ద్వితీయ స్థానంలో గెలిచిన విద్యార్థులను ఈనెల హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేస్తారని వెల్లడించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ అఫ్జల్, డీటీహెచ్ నాయకుడు సత్తార్, జిల్లా చెస్ అసోసియేషన్ కోశాధికారి టీపీ కృష్ణయ్య, వైస్ ప్రెసిడెంట్ గణేష్, జాయింట్ సెక్రటరీ రాములు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామ్‌ప్రసాద్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్స్ మోహన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాల అందజేత



కొత్తకోట రూరల్: మండలంలోని విలియంకొండ తండాలోని పలువురు వృద్ధులకు, దివ్యాంగులకు తెలంగాణ ఉద్యమకారుడు టీజీ మహేశ్ తన సొంత ఖర్చులతో వాకింగ్ స్టిక్స్, స్టాండ్‌లను అందజేశారు. మండలంలో నిస్సాహాయ స్థితిలో ఉన్న వారికి తనవంతు సహాయం చేయడం సంతోషంగా ఉందని, తాను చేస్తున్న సేవా కార్యక్రమంలో తన స్నేహితుల సహకారం ఎంతో ఉందన్నారు. అంతే కాకుండా ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు గోపాల్ నాయక్ ఉన్నారు.

విద్యార్థినికి అభినందన

కొత్తకోట రూరల్: ఈ ఏడాది 10 వ తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో ఉత్తమ ఫలితాలు సాధించి మండలంలో మొదటి ర్యాంకు సాధించిన కనిమెట్ట గ్రామానికి చెందిన ఎం.వైష్ణవిని బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించడంతో ఆదివారం గ్రామ మాజీ సర్పంచ్ గాదం రాణితో పాటు గ్రామస్తులు అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని తెలియజేయడానికి వైష్ణవినే నిదర్శమన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో పరమేశ్, వాకిటిగణం పరుశురాం, సురేష్‌కుమార్ యాదవ్, మందబాబు, శ్రీనివాస్‌రెడ్డి, భరత్‌కుమార్, తదితరులు ఉన్నారు.